విస్తారంగా సుబాబుల్ సాగు

- ఎకరం కర్ర రూ.లక్ష పలుకుతున్న వైనం
- సన్న కర్రకు కూడా డిమాండ్
- కూటమి ప్రభుత్వంలో మిర్చి, పత్తికి లభించని మద్దతు ధర
- ప్రత్యామ్నాయం వైపు రైతుల చూపు
- ఏటా పెరుగుతున్న సుబాబుల్ సాగు విస్తీర్ణం


వత్సవాయిలో సాగవుతున్న సుబాబుల్ తోట


గతేడాది సుబాబుల్‌లో అంతరపంటగా సాగు చేసిన పత్తి (ఫైల్)

వత్సవాయి: జగ్గయ్యపేట నియోజకవర్గంలో సుబాబుల్ సాగు విస్తీర్ణంగా ఏటా పెరుగుతోంది. అతివృష్టి, అనావృష్టిలను తట్టుకునేశక్తి ఉండటం తోపాటు తక్కువ పెట్టుబడితో సాగు చేసే అవకాశం ఉండటంతో రైతులు సుబాబుల్ సాగువైపు మొగ్గుతున్నారు. నాలుగేళ్ల కిందటి వరకు సుబాబుల్ కర్ర ధర అరకొరగానే ఉండటంతో రైతులు ఈసాగుపై ఆసక్తి చూపలేదు. దీంతో అధికశాతం రైతులు పత్తి, మిర్చి, వరి, మామిడి తదితర పంటలను సాగుచేసేవారు.

పదివేల ఎకరాలకు పెరిగిన విస్తీర్ణం..

ఐదేళ్లుగా సుబాబుల్ కర్రకు ఏటా డిమాండ్ పెరుగుతుండటంతో జగ్గయ్యపేట నియోజకవర్గంలో సుబాబుల్ సాగు విస్తీర్ణం కూడా పెరుగుతోంది. ప్రస్తుతం ఒక్క వత్సవాయి మండలంలోనే 4800 ఎకరాల్లో సుబాబుల్ తోటలు సాగవుతుండగా, నియోజకవర్గంలో 10వేల ఎకరాల్లో సుబాబుల్ సాగవుతున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది సాగు విసీర్ణం మరింత పెరగనుంది.

టన్ను ధర రూ.4500..

గతంలో సుబాబుల్ పంటను బీడు భూములు, సాగునీరు అందుబాటులో లేని పొలాల్లో మాత్రమే సాగు చేసేవారు. కానీ ప్రస్తుతం సుబాబుల్ కర్రకు మంచి ధర లభిస్తుండటంతో నీరు వసతి ఉన్న పొలాల్లోనే చేపట్టేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. నాలుగేళ్లుగా సుబాబుల్ కర్ర ధర క్రమంగా పెరుగుతుండటం కూడా ఈసాగు విస్తీర్ణం పెరగడానికి ప్రధాన కారణమని చెప్పవచ్చు. గతంలో సుబాబుల్ కర్ర సైజు ఆధారంగా టన్ను రూ.1800 నుంచి రూ.2వేలు పలుకగా, 2022 నుంచి ఈ ధర క్రమంగా పెరుగుతోంది. రెండేళ్లుగా టన్ను ధర రూ.4500 నుంచి రూ.6వేలు పలికిన సుబాబుల్ కర్ర ధర ప్రస్తుతం రూ.4500ప లుకుతోంది. దీంతో గతేడాది నుంచే సుబాబుల్ సాగు వైపు రైతులు మళ్లారు. మూడేళ్లకుగాను ఎకరానికి 30 టన్నుల వరకు కర్ర దిగుబడి వచ్చే అవకాశం ఉండటంతో రూ.లక్షపైనే ఆదాయం వస్తుందనే ఉద్దేశంతో రైతులు సుబాబుల్ సాగుకు మొగ్గుచూపుతున్నారు.

గిట్టుబాటు ధర ఇవ్వని ప్రభుత్వం..

ఈ ఏడాది మిర్చి, పత్తి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోవడం కూడా సుబాబుల్ సాగు వైపు రైతులు మొగ్గేందుకు ఓ కారణంగా చెప్పవచ్చు. గతేడాది టన్ను మిర్చి ధర రూ.23వేలు పలుకగా, ఈసారి రూ.10వేలు కూడా పలకలేదు. గతేడాదితో పోల్చితే పత్తికి కూటమి ప్రభుత్వంలో గిట్టుబాటు ధర లభించలేదు. అధిక వ్యయ, ప్రయాసాలతో కూడిన పత్తి, మిర్చి సాగులో ఈ ఏడాది నష్టాలే మిగలడంతో లబోదిబోమంటున్న రైతులు.. ప్రత్యామ్నాయంగా తక్కువ పెట్టుబడితో పూర్తయ్యే సుబాబాల్ సాగును చేపట్టేందుకు ఆసక్తిచూపుతున్నారు. అదేవిధంగా సుబాబుల్ సాగులో తొలి ఏడాది అంతరపంటగా పత్తి కూడా సాగుచేసే అవకాశం ఉండటం కూడా రైతులకు లాభిస్తోంది.

జోరుగా సన్న కర్ర కొనుగోళ్లు..

గతంలో సుబాబుల్ కంపెనీలు లావు కర్రను మాత్రమే కొనుగోలు చేసేవి. దీంతో చిన్న కర్ర అంతా వంట చెరుకుగా మారేది. కాని ప్రస్తుతం కంపెనీలు సన్న కర్రను కూడా కొనుగోలు చేస్తున్నాయి. ఈనేపథ్యంలో సన్నకర్ర కూడా డిమాండ్ పెరగడంతో రైతులు పొలాల గట్లవెంబడి, దొడ్లలో ఉన్న కర్రను కూడా వృథాగా పోనివ్వకుండా విక్రయిస్తున్నారు. జగ్గయ్యపేట పరిసర ప్రాంతాలలో విద్యుత్ ప్లాంట్లులు కూడా పెరగడంతో వారు కూడా అన్నిసైజుల కర్రను కొంటుండటంతో సుబాబుల్‌కు మరింత డిమాండ్ పెరిగి, సాగు విస్తీర్ణం కూడా ఏటా పెరుగుతోంది.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రూరల్ సీఐ చవాన్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ అనిల్

కంచికచర్ల: మండలం పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులకు కంచికచర్ల పోలీస్ స్టేషన్‌లో రూరల్ సర్కిల్ సీఐ చవాన్ ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ఘర్షణలు, ప్రైవేట్ పంచాయతీలకు జోలికి వెళితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు, వ్యాపారస్తులు, ప్రజలను ఇబ్బంది పెడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలన్నారు. క్రమం తప్పకుండా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లాలని ఆదేశించారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అనిల్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరచరిత్ర కలిగిన వారిపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. రౌడీషీటర్లు నడవడిక మార్చుకుని జీవనం సాగించాలని సూచించారు.

నందిగామ పట్టణంలో..

నందిగామటౌన్: రౌడీషీటర్లు తమ నేరపూరిత నడవడికకు స్వస్తి పలికి సత్ప్రవర్తనతో నడుచుకోవాలని నందిగామ సీఐ వైవీఎల్ నాయుడు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాయుడు మాట్లాడుతూ రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. అల్లర్లు, ఘర్షణలతోపాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పనులకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. తీరు మార్చుకుని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషకర జీవనం సాగించాలని హితవు పలికారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిని గుర్తించి వారిపై రౌడీషీట్ తొలగింపునకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. ఎస్ఐ అభిమన్యు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

జగ్గయ్యపేట/జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని కోదాడ రోడ్డులో ఉన్న బి కన్వెన్షన్ హాల్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నట్లు నందిగామ ఆర్డీఓ బాలకృష్ణ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేవచ్చన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలతోపాటు నందిగామ మండలంలోని ఏటిపట్టు గ్రామాల ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంచికచర్లలో..

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. ఆయా సమస్యలపై మండల ప్రజలు అర్జీలు అందజేయవచ్చన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


క్యూలైన్‌లో భక్తుల రద్దీ


బోనాలతో అమ్మవారి దర్శనానికి భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు కావడంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో వాహనాల రద్దీ కొనసాగింది.

భక్తులకు మట్టి కలశాల పంపిణీ


కలశాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తాతయ్య, నరేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: జూన్ రెండోతేదీన నిర్వహించనున్న పట్టణంలోని శ్రీధనశైల సీతారామ స్వామి దేవస్థానం(పెద్ద రామాలయం) దేవాలయ పునః ప్రతిష్టా మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని ప్రతి ఇంటికి ఒక జెండా, కలశాల పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఒక ముంత ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ తుమ్మేపల్లి నరేంద్రతో కలిసి స్వామి వారి 1008 కలశాల మట్టి కుండలు, జెండాలను భక్తులకు పంపిణీ చేశారు. రోజూ శ్రీరామ జప సమయంలో శ్రీరామ అని పలికిన ప్రతిసారి ఓ బియ్యపు గింజను ఆ మట్టికలశంలో వేయాలని పండితులు సూచించారు. ఇలా 11 రోజుల తర్వాత ఆయా కలశాలను రామాలయంలో అందజేయాలని సూచించారు. ఇలా వచ్చిన బియ్యంతో స్వామివారికి నైవేద్యం పెట్టనున్నట్లు అర్చకులు వివరించారు.

అపరిశుభ్రంగా ఆలయ పరిసరాలు


ఆలయ ఏసీ కార్యాలయం వద్ద నిలిచిన మురుగు


అధ్వానంగా ఉన్న పొంగలి తయారీ ప్రదేశం

అసహనం వ్యక్తం చేస్తున్న భక్తులు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ ఆవరణ అంతా అపరిశుభ్రంగా ఉండటంపై భక్తులు పెదవి విరుస్తున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు నిత్యం వందలాది మంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. అయితే ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య పరిస్థితి మరింత అధ్వానంగా ఉండటంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. కేశఖండనశాలలో మురుగు నీరు వెళ్లేందుకు అనువుగా లేకపోవడంతో మురుగు నీరంతా ఆలయ కార్యాలయంలోకి వచ్చి చేరుతుంది. స్వామి వారి గర్భగుడి సమీపం వద్ద వ్యర్థాలుండటంతో దుర్వాసన వెదజల్లుతుందని భక్తులు చెబుతున్నారు. ఆలయం పరిశుభ్రంగా ఉండేలా చూడటంలో ఆలయ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆలయ అపరిశుభ్రతపై ప్రశ్నించే భక్తులపై ఆలయ ఉద్యోగులు వాగ్వాదానికి దిగుతుండటం గమనార్హం. ఇకనైనా దేవదాయశాఖ అధికారులు స్పందించి ఆలయ ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

తిరువూరు చైర్‌పర్సన్ ఎన్నికపై ఉత్కంఠ

- ఆర్డీఓ ఆధ్వర్యంలో నేడు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం
- పోలీసు బందోబస్తు మధ్య ఎన్నిక
- జోరుగా ఊహాగానాలు ప్రచారం


చైర్‌పర్సన్ ఎన్నికకు కౌన్సిల్ హాల్‌లో ఏర్పాట్లు చేస్తున్న కమిషనర్, సిబ్బంది

తిరువూరు: మరో 10 నెలల్లో ముగియనున్న తిరువూరు నగర పంచాయతీ పాలకవర్గానికి చైర్‌పర్సన్ ఎన్నిక సోమవారం జరుగనుంది. వైఎస్సార్ సీపీ గెలుచుకున్న తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్‌ను దొడ్డిదారిలో చేజిక్కించుకునేందుకు తెలుగుదేశం పార్టీ చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతమయ్యే సూచనలు కనిపించడం లేదు. కౌన్సిల్లో ఎటువంటి బలం లేకపోయినా తెలుగుదేశం పార్టీ నాయకులు చైర్‌పర్సన్ ఎన్నికలో తామే గెలుస్తామంటూ గత వారం రోజులుగా ఊహాగానాలు విస్తృత ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లందరూ తమకు మద్దతు తెలుపుతారని, కౌన్సిల్ తమకే దక్కుతుందంటూ స్థానిక నాయకులు హడావుడి చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మాత్రం తమ అధినాయకత్వం సూచనల మేరకు ఎన్నికలో పాల్గొంటామని చెబుతున్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు కౌన్సిలర్లకు దిశా నిర్దేశం చేశారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నికపై పట్టణ రాజకీయ వర్గాల్లో సైతం జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి.

ఎన్నికల ప్రక్రియకు చర్యలు

చైర్‌పర్సన్ ఎన్నికకు తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మాధురి ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. నిబంధనల మేరకు కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌ను ఎన్నుకునేందుకు కౌన్సిల్‌హాల్లో సీటింగ్ ఏర్పాట్లు చేశారు. 20 మంది కౌన్సిలర్లలో ఐదో వార్డు సభ్యురాలు అనుమోలు రమాదేవి విదేశాల్లో ఉండగా మిగిలిన 19 మంది ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటారు. వైఎస్సార్ సీపీకి 17 మంది కౌన్సిలర్లుండగా, టీడీపీకి ముగ్గురు కౌన్సిలర్లతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుడైన ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఓటు హక్కు కలిగి ఉన్నారు.

జంట నాగుల విగ్రహ ప్రతిష్ఠ

తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో ఆదివారం జంట నాగుల విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు దాములూరు సత్యానారాయణ శర్మ, వేద పండితులు శివయ్య శాస్త్రి, వంశీ కృష్ణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు, గణపతికి, నవగ్రహాలకు, సర్పసూక్త నక్షత్ర హోమం నిర్వహించారు. ఆలయంలో ఇంతవరకు 36 జంట నాగుల విగ్రహాల ప్రతిష్ఠ జరిగిందని ఆలయ నిర్వాహకులు వూటుకూరు నారాయణరావు తెలిపారు.

ఘనంగా చందనోత్సవం



ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధి 16వ డివిజన్ స్క్రూబ్రిడ్జి సమీపంలోని పాత వీబీఎం కాలేజీ ఆవరణలోని ఇస్కాన్ మందిరంలో ఆదివారం జగన్నాథస్వామికి చందనోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథుడు చతుర్భుజ మహావిష్ణుగా, బలభద్రుడు అనంతశేషునిగా.. సుభద్రదేవి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. మామిడి కాయలతో స్వామివారి సింహాసనాన్ని అలంకరించారు. విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరయ్యారు. అనంతరం భక్తులందరికీ తీర్ధ ప్రసాదం ఇచ్చారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిర అధ్యక్షులు చక్రధరిదాస్, ప్రజాదాం దాస్, బలరాం గోవిందదాస్, శ్యాం పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేలం ద్వారా రూ.40 వేల ఆదాయం

నందిగామరూరల్: లక్ష్మీ పేరంటాళ్లు అమ్మవారికి చీరల వేలం ద్వారా రూ. 40,100ల ఆదాయం వచ్చిందని ఈఓ నరసింహమూర్తి తెలిపారు. మండలంలోని లింగాలపాడు గ్రామంలోని లక్ష్మీ పేరంటాళ్లు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం చీరల వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలకు దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం వేలం నిర్వహించగా రూ.40,100 ఆదాయం వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త చిరుమామిళ్ల వెంకట లక్ష్మీసాయిబాబు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నందిగామ టౌన్: స్థానిక చైతన్య కళాశాలలో 1997–99 ఇంటర్మీడియట్ చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒకొరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. కళాశాల చైర్మన్ అమరనేని రమేష్ బాబు దంపతులు, నాటి అధ్యాపకులను ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం పూర్వవిద్యార్థుల ఆటపాటలతో కళాశాల ఆవరణ సందడిగా మారింది. కార్యక్రమంలో తాటి రామకృష్ణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహణ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని కోదాడ రోడ్డులోని వెంకట సన్నీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని పేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ప్రారంభించారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ ఆస్పత్రి సిబ్బంది పాల్గొని సంతానలేమి సమస్యతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్యపరీక్షలు చేశారు. ఇటువంటి వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు

12మంది జూదరులు అరెస్ట్

కంచికచర్ల: మండలంలోని మోగులూరులో పేకాడుతున్న 12మందిని కంచికచర్ల పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.22,350 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఎస్ఐ బోనగిరి రాజు మాట్లాడుతూ పేకాట, క్రికెట్ బెట్టింగ్, జూదం ఆడేవారిపై కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

22న హనుమత్ జయంతి వేడుకలు

నందిగామరూరల్: మండలంలోని కె.కంద్రిక గ్రామంలో వేంచేసియున్న దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో ఈ నెల 22న హనుమత్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మేడా రామారావు ఆదివారం తెలిపారు.వేడుకల్లో భాగంగా స్వామివారికి పంచామృతాభిషేకం, నాగవల్లి అర్చన, లక్ష్మీగణపతి, నవగ్రహ, రుద్ర మన్యుసూక్త శ్రీరామ మహా మంత్ర హోమం, మహాపూర్ణాహుతి పూజలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన కళాక్షేత్ర డాన్స్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన పలువురు కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నాట్య గురువులు గీత, మౌనికల పర్యవేక్షణలో సుమారు 20 మంది విద్యార్థులు తమ నాట్య ప్రతిభను ప్రదర్శించారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి విద్యార్థులను అభినందించారు.

నిత్య జీవితంలో నీరు ఎంతో అవసరం

మైలవరం: నిత్య జీవితంలో నీరు ఎంతో అవసరమని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్షా కాలం రాక ముందే ఇంకుడు గుంతలను శుభ్రం చేసుకుని కొత్త వాటిని నిర్మించుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి. శివహరి ప్రసాద్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలిసి కళాశాల ఆవరణలోని ఇంకుడ గుంతలను శుభ్రం చేశారు. నీటిని నిల్వచేసే అంశంపై అవగాహన కల్పించారు.

ఇద్దరికి గాయాలు

వీరులపాడు: బస్సును కారు ఢీకొన్న ఘటనలో కారులోని ఇద్దరు వ్యక్తులు స్వలంగా గాయపడిన ఘటన ఆదివారం వీరులపాడు మండలంలోని జగన్నాథపురం సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఖమ్మం జిల్లా మధిర డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదివారం కంచికచర్ల నుంచి మధిర వెళ్తుండగా జగన్నాథపురం గ్రామ సమీపంలోని మలుపు వద్ద కంచికచర్ల వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులోని ఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు.

నందిగం సురేష్‌పై కక్ష సాధింపు చర్యలు తగవు

జగ్గయ్యపేటఅర్బన్: మాజీ ఎంపీ నందిగం సురేష్‌పై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ అన్నారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎంపీపై కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టడం అమానుషమన్నారు. దీనిని ఎస్సీ నాయకులను అణగద్రొక్కడానికి చేసే కుట్రగా భావిస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి చర్యలు మానుకోకపోతే భవిష్యత్‌లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ప్రజలే బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

చిత్రలేఖనంపై చిన్నారులకు శిక్షణ



కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా చిన్నారులకు ఆదివారం చిత్రలేఖనంపై శిక్షణనిచ్చారు. తొలుత అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్ మాట్లాడుతూ పురాతన వస్తువులు, పుస్తకాల ప్రాధాన్యాన్ని వివరించారు. చరిత్రను తెలుసుకునేందుకు మ్యూజియంలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు చెస్, డ్రాయింగ్‌పై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు, క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, కవి నీలం సర్వేశ్వరరావు, బీడీసీ శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

31.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

కంచికచర్ల: నందిగామ డివిజన్‌లో శనివారం రాత్రి సమయాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షానికి మొక్కజొన్న పంట పూర్తిగా తడిచిపోయింది. ఆరబెట్టిన వరి ధాన్యం కూడా తడిచిపోయిందని రైతులు ఆందోళన చెందారు.

31.2ఎంఎం వర్షపాతం...

నందిగామ నియోజకవర్గంలోని చందర్లపాడులో భారీ వర్షం కురిసింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి 31.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కంచికచర్ల మండలంలో 5.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా నందిగామలో 2.8 మి.మీ, వీరులపాడులో 6.8మి.మీ, చందర్లపాడులో 16.2 మిల్లీమీటర్ల వర్షం నమోదైనట్లు వివరించారు. కంచికచర్ల మండలంలో ఆదివారం కూడా వర్షం కురవడంతో రైతులు ఇబ్బందిపడ్డారు.

శివాజీ మహరాజ్ చరిత్ర నాటకం ప్రదర్శన

జగ్గయ్యపేట అర్బన్: నేటితరాలకు ఛత్రపతి శివాజీ మహరాజ్ జీవితచరిత్రను అందించడం ఆనందదాయకమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. స్థానిక కొత్త వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో సంస్కార భారతి, హిందూ చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ డిజిటల్ నాటక ప్రదర్శనను ఎమ్మెల్యే తాతయ్య ప్రారంభించారు. సుమారు 70మంది కళాకారులు నటించిన ఈ అద్భుతమైన నాటకం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం, రాఘవేంద్ర, హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పిన్నం వెంగళరావు, గాయత్రి ఆశ్రమ వ్యవస్థాపకులు చిట్టా లక్ష్మీనరసింహ శాస్త్రి, ప్రముఖ రంగస్థల కళాకారుడు బొబ్బిళ్లపాటి సాయి, శివాజీ విగ్రహం కోర్ కమిటీ ప్రతినిధులు పబ్బతి నరేంద్ర, అల్లి రవిచంద్, సంకా భాస్కర్, ఎన్.రఘు పాల్గొన్నారు.